ప్రజాశక్తి





మంగళవారం 3 సెప్టెంబరు 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా





సింగ్‌నగర్‌లో వరద బాధితుల తిప్పలు



బ్యారేజి వద్ద కృష్ణమ్మ వరద ఉధృతి

కన్నీరే మిగిలింది..!

- ఆహారం, మంచినీటి కోసం హాహాకారాలు
- రికార్డు స్థాయిలో బ్యారేజీకి వరద
- సిఎం చంద్రబాబు, మాజీ సిఎం జగన్ పరామర్శ
- ఆహారం, రొట్టెలు పంపిణీ చేసిన సిపిఎం నేతలు



సింగ్‌నగర్‌లో బాధితులను బోటులో వెళ్లి పరామర్శిస్తున్న సిఎం చంద్రబాబు



సింగ్‌నగర్‌లో బాధితులను ట్రాక్టర్లో వెళ్లి పరామర్శిస్తున్న మాజీ సిఎం జగన్

బుడమేరు ముంపుకుతోడు కృష్ణమ్మ వరద ప్రజా జీవనాన్ని అతలాకుతలం చేశాయి. బుడమేరు బాధితులు రెండు రోజులుగా ముంపులోనే ఉండగా, సోమవారం కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వరద బాధితులు భోజనం, మంచినీటి కోసం హాహాకారాలు చేస్తున్నారు. అజిత్‌సింగ్‌నగరలో భవనాలపై నుండి 'మాక్కు భోజనం పెట్టండి ప్లీజ్' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. నగరంలో 12 డివిజన్లలో మూడున్నర లక్షల మందికిపైగా పజలు రెండురోజులుగా ముంపులోనే ఉన్నారు. మంచినీరు, ఆహారం, విద్యుత్ లేక అవస్థలు పడుతున్నారు. పసిపిల్లలకు పాల ప్యాకెట్లు కూడా దొరకడంలేదు. పిల్లలు ఆకలితో అలమటిస్తున్నారు. బాధితుల కష్టాలు హృదయ విదారకంగా ఉన్నాయి. తమ కుటుంబ సభ్యులు వరదల్లో చిక్కుకున్నారని, కాపాడాలని వేడుకొంటున్నారు. "మీరు సహాయక చర్యలు చేయకపోతే కనీసం మమ్మల్నయినా లోపలికి పంపాలి' అంటూ వేడుకొంటున్నారు. కొందరు ప్రైవేటు బోటు యజమానులు తమను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రూ.1500 నుండి రూ.4 వేల వరకు డిమాండ్ చేస్తున్నట్లు బాధితులను ఆరోపిస్తున్నారు. కొందరు అర లీటరు పాల ప్యాకెట్‌ను రూ.70లకు అమ్ముతున్నారు. ఆదివారం రాత్రంతా చిమ్మచీకట్లలోనే ముంపు బాధితులు గడిపారు. మేడలు, మిద్దెలపైనే ఉండిపోయారు. కొందరు బాధితులు తమ పిల్లలు, వృద్ధులు, మహిళల కోసం రెండు మూడు కిలోమీటర్ల మేర పీకలోత్తు నీటిలో వచ్చి ఆహారం, పాలు, మంచినీరు తీసుకుని వెళుతున్నారు. బాధితులకు సహాయం అందించేందుకు రెస్క్యూ ఆపరేషన్ నిర్వమించారు. ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. నేవీ హెలికాప్టర్ల ద్వారా సహాయక చర్యలు చేపడుతున్నాయి. మరోవైపు కృష్ణా నది వరదతో పందచీశీఅవగట పొలాలు నీట మునిగాయి. ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాలో వేలాది ఇళ్లు , వేలాది హెక్టర్లలోని పొలాలు ముంపునకు గురయ్యాయి. అలాగే విజయవాడలో వరద బాధితులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి సోమవారం పరామర్శించారు. సిపిఎం నేతలు రాష్ట్ర నేతలు ఆహారం, రొట్టెలు, కొవ్వొత్తులు పంపిణీ చేశారు. కృష్ణానది, బుడమేరు వరద ముంపు ప్రాంతాల్లో సిపిఎం రాష్ట్ర నేతల బందం పర్యటించింది. వరదల్లో మునిగిన ఇళ్లను నేతలు సందర్శించారు. ప్రజల కష్టాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. కృష్ణానది వరద సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు 125 ఏళ్ల చరిత్రలో రికార్డుస్థాయిలో అత్యధికంగా 11,43,414 క్యూసెక్కులుగా నమోదైంది.

విజయవాడ అజిత్‌సింగ్‌నగర్లో పర్యటిస్తున్న సిపిఎం నేతలు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, డి.రమాదేవి, వి.వెంకటేశ్వర్లు, కె.ప్రభాకర్‌రెడ్డి, కె.సుబ్బరావమ్మ, డి.వి.కృష్ణ,, ఎన్.సిహెచ్.శ్రీనివాస్ తదితరులు



మూడు రోజుల్లో ఏడుగురు మృతి, ఒకరు గల్లంతు

ప్రజాశక్తి - మైలవరం

భారీ వర్షాలు, వరదల కారణంగా గత మూడు రోజుల్లో ఎన్‌టిఆర్ జిల్లాలో ఏడుగురు మరణించగా, ఒకరు గల్లంతయ్యారు. ఒక్క మైలవరం నియోజకవర్గంలోనే ఐదుగురు మరణించారు. మృతదేహాలు బయటపడడంతో ఆ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. ఆగస్టు 31న మైలవరం మండలం అనంతవరం గ్రామానికి చెందిన తుపాకుల వెంకటేశ్వరరావు(63) గేదలను తోలుకెళ్లి వరద ప్రవాహంలో గల్లంతయ్యాడు. ఆయన మతదేహం పొందుగల గ్రామ శివారు పంగిడి చెరువులో దొరికింది. అలాగే వెల్వడం గ్రామానికి చెందిన శెట్టిపల్లి కష్ణారెడ్డి (47) బుడమేరు వరద ఉధతికి కొట్టుకుపోయాడు. బుడమేరులో సోమవారం మృతదేహం దొరికింది. జి.కొండూరు మండలం గంగినేని గ్రామానికి చెందిన నల్లబోయిన వెంకటేశ్వరరావు ఇంటి గోడ కూలి మరణించాడు. హెచ్ ముత్యాలంపాడు గ్రామానికి చెందిన చల్లా మోహనకష్ణ పశువులను ఇంటికి తోలుకోస్తూ వరద ప్రవాహంలో గల్లంతయ్యాడు. మతదేహం ఆదివారం సాయంత్రం లభించింది. అదే గ్రామానికి చెందిన పైడి పాముల పార్వతి(27) ఆదివారం గ్రామ శివారున వరద ప్రవాహంలో ట్రాక్టర్ బోల్తా పడటంతో గల్లంతైంది. గల్లంతైన ప్రదేశం నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో మృతదేహం లభించింది. సోమవారం సింగ్‌నగర్ ప్రాంతానికి ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం కొట్టుకువచ్చింది. అలాగే ఇబ్రహీంపట్నం జూపూడి వద్ద ఓ విద్యుత్ లైన్‌మెన్ విధుల్లో ఉండగానే కృష్ణానది వరదలో ప్రమాదవశాత్తూ పడి మరణించాడు. విజయవాడ రూరల్ మండలం పైడూరుపాడులో ఓ యువకుడు గల్లంతయ్యాడు.

నదీతీరంలో వేలాది గృహాలు, పంటలు మునక

- 12, 630 మంది తరలింపు సురక్షిత ప్రాంతాలకు
- 12, 890 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

కృష్ణానదీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలు భయం గుప్పిట కాలం వెళ్లదీస్తున్నారు. కృష్ణానది జలప్రళయానికి బెంబేలెత్తి పోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 11 లక్షల క్యూసెక్కులకుపైగా వరద నీటిని బ్యారేజీ దిగువకు వదిలారు. అవనిగడ్డ-విజయవాడ కరకట్టరోడ్డుకు అనుకుని నీరు ప్రవహిస్తోంది. పలు ప్రాంతాల్లో ఇసుక కట్టలను పేర్చి కట్ట



మోపిదేవి మండలం కె కొత్తపాలెంలో వరద బాధితులు

కోతకు గురవ్వకుండా అధికారులు చర్యలు చేపట్టారు. పెనమలూరు, కంకిపాడు, తోట్లవల్లూరు, పమిడిముక్కల, ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ, నాగాయలంక మండలాల్లోని కరకట్టలోపలున్న గ్రామాలు, లంకల్లోని గృహాలు

(మిగతా 2లో)

వరద కష్టాలు !

- ఐదేళ్లలో మూడుసార్లు విపత్తులు
- రైతులు అప్పులపాలు
- బాధితులు రోడ్లపాలు



తోట్లవల్లూరు మండలంలో నీట మునిగిన అరటితోట

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి : ఇల్లు మునిగింది. ఇంటిపై పెట్టిన ఖరీదైన ఎలక్ట్రికల్ సామానులు మునిగాయి. కట్టుబట్టలతో మిగిలారు కొందరు. కౌలు ముందే చెల్లించి పంటల సాగుకు రూ. లక్షల్లో పెట్టుబడి పెట్టిన మరికొందరు తమ కళ్లెదుటే పంటలు ముంపులో ఉండటాన్ని చూసి జీర్ణించుకోలేకపోతున్నారు. వరద కట్టపై నుంచి తమ పొలాలను చూసుకుంటూ ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. 2019 -2024 మధ్య ఐదేళ్లకాలంలో మూడు సార్లు వరదకు పంటలు నష్టపోవడంతో అప్పుల ఊబిలో కూరుకు పోయామని రైతులు, కౌలు రైతులు వాపోతున్నారు.

మోపిదేవి మండలం కె.కొత్తపాలెంకు చెందిన ఆరుంబాక రాజేష్ వరద సమాచారంతో ఇంటిలోని ఫ్రిజ్, టివి మిక్సీ డాబాస్లాబుపైన పెట్టారు. వర్షాలకు తడవకుండా, ఎండకుండా పరాదాలు కట్టి జాగ్రత్త పడ్డారు. ఎవ్వరూ ఊహించని విధంగా డాబాపై స్లాబు వరదకు మునిగిపోయింది. లంక గ్రామాలు, నదీ పరివాహక గ్రామాల్లోని అనేక మంది కట్టుబట్టలతో మిగిలామని వాపోతున్నారు. ఈ మండలంలోని బొబ్బర్లంకకు చెందిన బాల కామేశ్వరరావు మూడు ఎకరాల్లో బొప్పాయి సాగు చేశారు. ఎకరాకు 1.30 వేలు చొప్పున 3 లక్షల 90 వేలు పెట్టుబడి పెట్టారు. ముమ్మినవీరభద్రం 4.30 ఎకరాల్లో మునగతోట సాగుకు రూ. 3.20 లక్షలు ఖర్చు చేశారు. చల్లపల్లి మండలం నడకుదురుకు చెందిన గుంటూరు సురేష్ ఐదు ఎకరాల్లో పసుపు, మూడు ఎకరాల్లో అరటి సాగు చేశారు. ఎకరాకు రూ. 40 వేలు చొప్పున 3 లక్షల 20 వేలు ముందు కౌలు చెల్లించారు. ఎకరాకు మరో రూ. 60 వేలు చొప్పున 4 లక్షల 80 వేలు సాగుకు పెట్టుబడి పెట్టారు. మొత్తం రూ. 8 లక్షలు అప్పు చేసి పెట్టుబడి పెట్టారు. ఇలాగే రూ. లక్షలు పెట్టుబడి పెట్టి కొందరు కంద, మరికొందరు తమలపాకు, ఇంకొందరు సాగు చేసిన చెరకు పంట వరదకు నీట మునిగాయి. వరద నష్టాలు చూసి రైతులు అప్పులపాలయ్యామని వాపో తున్నారు.

ఐదేళ్లలో మూడు సార్లు వరద పాలు

సారవంతమైన కృష్ణానది పాయలకు కట్టలకు మధ్య, లంక భూముల్లో అధిక విస్తీర్ణంలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. అరటి, కంద, కూరగాయలు, మునగ, బొప్పాయి. పూల తోటలు, పసుపు, మల్బరీ, జామ, నిమ్మ తోటలు సాగు చేస్తున్నారు. భూములకు యజమానులు ముందుగానే కౌలు వసూలు చేస్తున్నారు. ఈ ఎకరాకు లక్ష వరకు పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి. సాధారణ పరిస్థితుల్లో రైతు, కౌలు రైతులకు ఒకింత ఆదాయాన్ని సమకూర్చుతున్న ఈ పంటలు వరదల పాలయిన సందర్భాల్లో వారిని తీవ్రమైన అప్పుల్లోకి నెడుతున్నాయి. ప్రకాశం బ్యారేజీ దిగువకు 5.50 లక్షల క్యూసెక్కులలోపు వరద నీరు వదిలినా పెద్దగా నష్టం వాటిల్లదు. 2019 అగస్టు, 2020 అక్టోబర్‌ల్లో ఎనిమది , ఏడు లక్షల క్యూసెక్కులకుపైగా నీరు విడుదలవ్వగా తాజాగా గతంలో ఎన్నడూ లేని విధంగా 11. 5 లక్షల క్యూసెక్కుల నీరు విడుదలయింది. దీంతో పరివాహక ప్రాంతంలో ఏడు మండలాల్లో వేల ఎకరాలు ముంపుకు గురయ్యాయి. ఐదేళ్లలో మూడు సార్లు వరద రావడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయామని రైతులు వాపోతున్నారు.

మొదటిపేజీ తరువాయి

నదీతీరంలో వేలాది గృహాలు, పంటలు మునక

సంఖ్యలో నీట మునిగాయి. గృహోపయోగ వస్తువులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్న వేలాది ఎకరాల్లో సాగవుతున్న ఉద్యాన, వ్యవసాయ పంటలు నీట మునిగాయి. కోడూరు మండలంలో రొయ్యల చెరువులు నీట మునిగడం రైతులను ఆవేదనకు గురిచేస్తోంది. కృష్ణానది వరద ప్రవాహం కాలువలు, డ్రయిన్ల ద్వారా ఎదురు ప్రవహించి పలు ప్రాంతాల్లో పంటలు మునుగుతున్నాయి.

సురక్షిత ప్రాంతాలకు 12, 630 మంది

పెనమలూరు మండలంలోని విజయవాడకు సమీపంలోని పులిపాక, యనమలకుదురులో కరకట్ట లోపల ఉన్న వందలాది గృహాలు నీట మునిగాయి. ఈ రెండు గ్రామాల్లో ఎనిమిది వందల మందిని రెండు పునరావాస కేంద్రాలకు తరలించారు. తోట్లవల్లూరు మండలంలో తోడేళ్లలంక, కళింగదిబ్బ, పాములలంక, తుమ్మలపచ్చిక, కనిగిరిలంక, , పొట్టిగిత్తదిబ్బ, ములగలలంక తదితర ఎనిమిది లంక గ్రామాలు వరద ప్రభావానికి గురయ్యాయి. ఆరు వేల మందిని తరలించారు. ఆరు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. చల్లపల్లి మండలంలో ఆముదాల్లంక ముంపుకు గురైంది. 230 మందిని, మోపిదేవి మండలంలో బొబ్బరలంకలో 500, కొక్కిలిగడ్డలో 700, మోపిదేవి వార్పులో 70 గృహాలు నీట మునిగాయి. 3100 మందిని వెలుపలకు తరలించారు. అవనిగడ్డ మండలంలో ఎడ్లలంక పూర్తిగా వరద నీటిలో మునిగింది. రేగుల్లంక, పల్లెపాలెం, అవనిగడ్డ పంచాయతీ పరిధిలో వసుమట్ల, దక్షిణచిరువోల్లంక, మేడిలంక, అయ్యవారిపాలెం, ఎస్‌సి కాలనీలు ముంపుకు గురయ్యాయి. 2,300 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నాగాయలంక మండలం పల్లెపాలెం, ఎదురుమెండి, నాచుగుంట, ఏసుపురం, ఈలచెట్లదిబ్బ గ్రామాల్లోకి వరద నీరు వచ్చింది.

13,390 ఎకరాల్లో ఉద్యాన పంటలు మునక

కృష్ణానది పరీవాహక ప్రాంతంలో వరద ప్రభావానికి జిల్లాలోని ఏడు మండలాల్లో 12, 630 ఎకరాల్లో పంటలు ముంపుకు గురయ్యాయి. అరటి, కంద, పసుపు, తమలపాకు, మల్బరీ, కూరగాయల పంటలు అత్యధిక విస్తీర్ణంలో సాగవుతున్నాయి. పెనమలూరు మండలంలో చోడవరం, పులిపాక, యనమలకుదురు గ్రామాల్లో 227 ఎకరాలు, కంకిపాడులో మండలంలో మద్దూరు, కాసరనేనిపాలెం గ్రామాల్లో 245 ఎకరాలు, తోట్లవల్లూరు మండలంలోని ఎనిమిదిలంక గ్రామాల్లో 5,438 ఎకరాలు, పమిడిముక్కల మండలంలో 150 ఎకరాలు, ఘంటసాల మండలంలోని శ్రీకాకుళం, పాపవినాశనం, గోగినేనిపాలెంలో 280 ఎకరాలు, చల్లపల్లి మండలంలోని వెలువోలు, నిమ్మగడ్డ, నడకుదురు, రాముడుపాలెం, నాదెళ్లవారిపాలెం, ఆముదార్లంక, సీతపేడలంక, లచ్చిగానిలంకల్లో 1550 ఎకరాలు నీట మునిగాయి.

పెరుగుతున్న ముంపు

- జిల్లాలో 25,803 హెక్టార్లలో వ్యవసాయ పంటలు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి : వర్షాలు తగ్గి మూడు రోజులు కావస్తున్నా జిల్లాలో అనేక ప్రాంతాల్లో పంటలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. దీనికి కృష్ణా వరద తోడవ్వడంతో పంటల ముంపు పెరుగుతోంది. జిల్లాలో 28,884 మంది రైతులకు సంబంధించిన 25,803 హెక్టార్లులోని వ్యవసాయ పంటలు ముంపుకు గురైనట్లు వ్యవసాయశాఖ ప్రాధమిక అంచనా. మూడు రోజులుగా నీటిలో మునిగి ఉన్న పంటలు పనికిరాకుండా పోతాయని, పెట్టిన పెట్టుబడి నీటి పాలవుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి 24,878 హెక్టార్లలో, పత్తి 130 హెక్టార్లలో, మినుము 286 హెక్టార్లలో, చెరకు 200 హెక్టార్లలో, వేరుశనగ 112 హెక్టార్లలో దెబ్బతిన్నాయి.

ముంపునకు గురైన వరి వివరాలు

ఉంగుటూరు	1615	మొవ్వ	450
పమిడిముక్కల	1441	చల్లపల్లి	1109
ఉయ్యూరు	483	ఘంటసాల	1613
గన్నవరం	2,819	మచిలీపట్నం	2,400
పెనమలూరు	702	పెడన	180
బాపులపాడు	1540	గూడూరు	185
పామర్రు	782	బంటుమిల్లి	120
తోట్లవల్లూరు	789	కృత్తివెన్ను	64
గుడ్లవల్లేరు	503	గుడివాడ	1050
కంకిపాడు	1632	పెదపారుపూడి	1291
అవనిగడ్డ	650	నందివాడ	1072
మోపిదేవి	900	**మొత్తం**	**24,878**
నాగాయలంక	1508		

మృతదేహం అప్పగింత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలం కౌతవరం గ్రామానికి చెందిన పెందుర్తి యశ్వంత్(21) అనే విద్యార్థి కొండ చెరియలు విరిగిపడి విజయవాడలో మత్యువాత పడ్డాడు. మతుని బంధువులు చెప్పిన వివరాల మేరకు హెూటల్ మేనేజ్మెంట్ విద్య కోసం విజయవాడ మొగల్రాజపురంలో స్నేహితుని ఇంటిలో జస్వంత్ ఉంటున్నాడు. శనివారం తెల్లవారుజామున వరద బీభత్సంతో కొండ చెరియలు విరిగిపడి మీద పడడంతో జస్వంత్ మృతిచెందాడు. ఆ భవన శిధిలాల్లో ఇరుక్కుపోయిన జస్వంత్ మతదేహాన్ని వెలికి తీసేందుకు మూడు రోజులు పట్టింది. సోమవారానికి మతదేహం లభించడంతో పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. స్వగ్రామానికి తీసుకొచ్చిన మతదేహం వద్ద తల్లిదండ్రులు యేసు ప్రసాద్, విజయలక్ష్మి గుండెలవిసేల రోధించారు.

పంట పొలాలు పరిశీలన

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: గత రెండు రోజులుగా విస్తారంగా కురిసిన వర్షాలు,వరద ప్రభావం తో మచిలీపట్నం మండలంలోని పలు గ్రామాలలో నీట మునిగిన పొలాలను మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కే నాగేంద్ర, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి శ్రీలత,కెవికె ఘంటసాల సైంటిస్ట్ డాక్టర్ కే లహరి రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధిక వర్షాలు అనంతరం తీసుకోవాల్సిన చర్యలు గురించి తెలుపుతూ వర్షాలకు వరి పైరు మూడు కన్నా ఎక్కువ రోజులు నీట మునిగితే వీలైనంత త్వరగా నీరు బయటకి తీసివేయాలి అన్నారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకొని ఆ పార్టీ మచిలీపట్నం ఇంచార్జ్ బండి రామకష్ణ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం,మొక్కల పంపిణీ, అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, మాజీ పార్లమెంట్ సభ్యులు కష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల్లో పర్యటన

ప్రజాశక్తి-మోపిదేవి: మోపిదేవి మండలం కే.కొత్తపాలెం గ్రామాల్లో వరదకు పూర్తిగా నీట మునిగిన ఇళ్లను నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి టీవీ సతీష్ పరిశీలించారు. అలాగే మండల పరిధిలోని ఉత్తర చిరువోలు లంక వద్ద కష్ణానది కరకట్టను కూడా పరిశీలించారు.

వరద ఉధృతి

- పొంగుతున్న ఏలూరు కాల్వ, బుడమేరు, చీమలవాగు
- చెరువుల్లా పంట పొలాలు
- దివిసీమలో కృష్ణమ్మ ఉగ్రరూపం
- పలుచోట్ల కాల్వగట్లకు గండి
- పునరావా కేంద్రాలకు వరద బాధితులు తరలింపు



అవనిగడ్డ మండలంలో పడవలపై ప్రయాణం చేస్తున్న వరద బాధితులు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలాన్ని బుడమేరు, ఏలూరు కాలవతో పాటు పలు చెరువులు ముంచేశాయి. గన్నవరంతో పాటు చుట్టుపక్కల ఉన్న అన్ని గ్రామాలను జలదిగ్బంధనం చేసింది. గంట గంటకు వరద ఉధతి పెరుగుతుండటంతో పొలాలతో పాటు వెంచర్లలో కట్టిన అపార్ట్మెంట్లన్నీ ముంపుకు గురయ్యాయి. ట్రాక్టర్లలలో జనాలను వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్ బందాలు రంగంలోకి దిగి సేవలు అందిస్తున్నాయి. భారీ వరద కారణంగా కేసరపల్లిలో చీమల వాగు ఉగ్రరూపం దాల్చింది. పైనుంచి వస్తున్న వరద కూడా దానికి తోడ వడంతో పొలాలన్నీ సంద్రాన్ని తలపిస్తున్నాయి. సావార గూడెం రోడ్డులో ఉన్న జగనన్న కాలనీని నీరు చుట్టేసింది. ఇళ్లలో ఉంటున్న నివాసితులను ట్రాక్టర్లలో సావర గూడెం తరలించారు. ఏలూరు కాలువకు కేసరపల్లి వద్ద, అప్పారావుపేట వద్ద గండి పడటంతో నీరంతా పొలాల్లో పడింది. పొలాలు మునిగిపోయి చెరువులను తల పిస్తున్నాయి. అదేవిధంగా బుడమేరు కట్ట మూడు చోట్ల తెగిపోవడంతో వరద నీరంతా పొలాలను ముంచేసింది. కేసరపల్లి, జక్కుల నెక్కలం, గూడవల్లి, అప్పారావుపేట ఏరి యాల్లో వరి పొలాలు మునిగాయి. ఏలూరు కాలువ దెబ్బకు వందల ఎకరాల్లో పంట కొట్టుకుపోయింది. బ్రహ్మయ్య లింగం చెరువు కన్నెర్ర చేయడంతో కింద ఉన్న గొల్లనపల్లి, చిక్కవరం, బీబీ గూడెం, కొత్తగూడెం, గోపవరపు గూడెం, పురుషోత్తపట్నం ఏరియాలోని చెరువులకు వరద నీరు పోటెత్తింది. అలాగే బాపులపాడు మండలం రామన్నగూడెం గ్రామంలో తీవ్ర వర్ష భావ వలన మునిగిపోయిన ఇళ్లలో నివసిస్తున్న గ్రామస్తులకు యార్లగడ్డ సతీష్ భోజన సదుపాయం కల్పించారు.

ఏలూరు కాల్వకు గండ్లు

బుడమేరులోని నీరు ఏలూరు కాలువలోనికి రావడంతో గన్నవరం నియోజకవర్గంలోని కేసరపల్లి గ్రామ శివారు అప్పారావుపేట, బుద్ధవరం, ఆత్కూరు గ్రామాల నిధిగా వెళ్లి ఏలూరు కాలువ గట్టు కోతకు గురి కావడంతో తెగిన గట్టుకు మరమ్మత్తులు కోసం గ్రామంలోని ప్రజలు పంచాయతీ సిబ్బంది వరిగడ్డి సాయం తోటి ఆపి ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుద్ధవరం గ్రామం చివర ఏలూరు కాలువ గట్టు కి గండిపడటంతో ప్రవహిస్తున్న నీరు గ్రామంలోనికి ప్రవేశంతో పాటు సమీపంలోని ఎయిర్పో ర్టులోనికి ప్రవహిస్తోంది. భారీ వర్షాలకు మండలంలోని చేలు పూర్తిగా మునిగి పోయి రైతులు పూర్తిగా నష్టపోయారని, ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని సీపీయం గన్నవరం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** ఏలూరు కాలువ ఏ సమయంలో తెగి ఊరి మీద పడుతుందో అనే ఆందోళనలో ఆత్కూరు, ఆవుటుపల్లి గ్రామాల ప్రజలు కొట్టుమి ట్టాడుతున్నారు. ఇప్పటికే ఆత్కూరులో కాలువ కట్ట తెగి ఊరి మీద పడడంతో ఆ ప్రాంత వాసులను 150 మంది కి ఆత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పునరావాసం ఏర్పాటు చేశారు. ఆవుటపల్లి లో ముస్లీం పేట వద్ద ఏలూరు కాలువ కట్ట పొంగి పొర్లడం గమనించిన స్థానికులు సంచులను మట్టితో నింపి అడ్డు కట్ట వేశారు. అదే విధంగా యానాదుల కాలనీ వద్ద కాలువ కట్టకు మరమ్మతులు చేశారు. ఆవుటపల్లి పాఠశాలలో 190 మందికి పునరావాసం ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని ఆత్కూరు, ఆవుటపల్లి గ్రామాలలో వరద బాధితులకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సిపిఎం మండల నాయకులు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టివి లక్ష్మణస్వామి, మండలకార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వ రరావు, మండల పార్టీ నాయకులు కడవకొల్లు రామరాజు తదితరులు పరిశీలించారు.

దివిసీమలో కృష్ణమ్మ మహా ఉగ్రరూపం

ప్రజాశక్తి-అవనిగడ్డ : దివిసీమలో కృష్ణానది మహా ఉగ్రరూపం దాల్చి పంట భూములు ఊర్లు ఏకం చేసింది. వరద ప్రవాహం నుండి రక్షణ కవచంగా ఉన్న కరకట్ట ఏ మేరకు రక్షించగలదో తెలియని పరిస్థితి దాపురించింది. కరకట్ట అనేకచోట్ల బలహీనపడి ఉండటంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఆ ప్రాంతాలపై దష్టి సారించి ఇసుక మోటాలతో పటిష్టం చేస్తున్నారు. వేపనూరు వద్ద కరకట్ట బలహీనంగా ఉండటంతో అక్కడ ఇసుక మోటర్ వేసి పటిష్టం చేశారు. ఇదిలా ఉండగా పులిగడ్డ ఆక్విడేట్ వంతెన పైనుండి వరద నీరు ఉదతంగా ప్రవహిస్తోంది. దీనితో ఆ ప్రాంతంలో 28 అడుగుల మేర వరద ప్రవాహం కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. నదీ గర్భంలోని గ్రామాలైన పాత ఎడ్ల లంక పూర్తిగా వరద నీటిలో ఉండగా పులిగడ్డ పంచాయతీ శివారు రేగులంక పల్లెపాలెం గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశించింది. అదేవిధంగా దక్షిణ దక్షిణ చిరువోలు లంక పంచాయతీ పరిధిలోని మేడి లంక, అయ్యవారిపాలెం, చిరువలంక గ్రామాలలో వరద నీరు ప్రవేశించి ఆ గ్రామస్తులందరినీ ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నాగాయలంకలోని పల్లె పాలెం లోని 100 గహాలు కూడా వరద ముంపుకు గురయ్యాయి.

సహాయ చర్యల్లో భాగస్వాములు కావాలి : వెంకట్రామ్

దివిసీమకు సంభవించిన కష్ణా నది వరదల వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సహాయక చర్యలు అందించేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తనయుడు మండలి వెంకట్ రామ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన మండల పరిధిలోని దక్షిణ చిరు ఓలులంక, పులిగడ్డ శివారు వస్తుమట్ల గ్రామాలను కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు.

కరకట్టను తాకిన వరద

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : కష్ణ నది పాయకు వచ్చిన భారీ వరద కష్ణ నదీ కరకట్ట అంచల వరకు చేరింది .కనుచూపుమేరా అంత నీటిమయం అయిపోయింది. లంక పొలాలు చూడడానికి ఆనవాలు కూడా లేకుండా కనుమరుగైపోయాయి. వేలాది ఎకరాలు నీట మునిగి పోయాయి. అరటి,కంద, తమలపాకు, పసుపు, చెరకు, కూరగాయ వంటి పంటలు నీటి మునిగిపోయాయి. లంక గ్రామాల ప్రజలు ఇళ్లల్లోకి చేరిన వరదనీటికి భయపడి ప్రాణాలు కాపాడుకోవడానికి పునరావాస కేంద్రాలకు తరలివచ్చారు. అధికారులు ప్రజాప్రతినిధులు పడవలపై ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఐలూరు, దేవరపల్లి, చాగంటిపాడు, భద్రిరాజుపాలెం తోట్ల వల్లూరు వల్లూరు పాలెం గ్రామాల్లో పునరావాస కేంద్రాల ఏర్పాటు చేసి 600 మందిని కి ఆశ్రయం కల్పించామని తాసిల్దార్ కుసుమకుమారి తెలిపారు.

ప్రభుత్వం ఆదుకుంటుంది : మంత్రి సవిత

వరదల వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరిని ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా అన్నారు. సోమవారం మండలంలో వరద ప్రభావిత ప్రాంతాలను వీరు పరిశీలించారు. తోట్లవల్లూరు కష్ణా నది రేవు వద్ద పడవలలో దిగి పునరవాస కేంద్రాలకు వస్తున్న వరద బాధితులను పరామర్శించి, ధైర్యం చెప్పి మాట్లాడారు. ఎవరు అధైర్యపడవద్దని కూటమి ప్రభుత్వం ప్రతి ఒక్కరికి అండగా ఉంటుందన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : హరిబాబు

వరదల వల్ల నష్టపోయిన ప్రతి ఒక్క రైతు, కౌలు రైతును ప్రభుత్వం ఆదుకో వాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు అన్నారు. సోమవారం మండలంలో వరదలు వల్ల మునిగిపోయిన పంటలను పరిశీలించి పంటల నష్టపోయిన రైతులను పరామర్శించారు. కౌల్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారావు, రైతు సంఘం నాయకులు శ్రీహరి, శంకర్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు నరేష్,కౌర్ రైతు సంఘం మండల కార్యదర్శి లెనిన్ సభ్యులతో కూడిన బందం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం పునరవాస కేంద్రాల్లో ఉన్న లంక గ్రామాల ప్రజలతో మాట్లాడి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తోట్లవల్లూరు మండలంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లోని వరద బాధితులకు అధికారులు ఆహారం కూడా పెట్టలేకపోయారని హరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి-బంటుమిల్లి : మండలంలోని మలపరాజ గూడెంలో వందలాది ఎకరాలు వరిపలాలు నీటిలో మునిగాయి. నష్టపోయిన రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలని రైతు సంఘం కష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పొలాలను పరిశీలించిన వారిలో బంటుమిల్లి మండల రైతు సంఘం కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్, దూసనపూడి పరంధామయ్య, రామారావు తదితరులు ఉన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** మండలంలోని కడవకొల్లు, వీరవల్లి గ్రామాల పరిధిలోని 400 ఎకరాలు పూర్తిగా వరద నీటిలో ముంపుకు గురయ్యాయని సిపిఎం సీనియర్ నాయకులు రైతు సంఘం మండల కార్యదర్శి అన్నే సుబ్బారావు తెలిపారు. సోమవారం పార్టీ నాయకులతో కలిసి మండలంలో పలు గ్రామాలలోని పొలాలను పరిశీలించారు. ముఖ్యంగా చంద్రయ్య కోడు మురుగు కాలువ పూడిక తీత పనులు ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం వల్ల వరి పొలాలు మునిగాయన్నారు. పట్టణ కార్యదర్శి బి రాజేష్, తోమాటి లక్ష్మణరావు, బి కీర్తి, మాగంటి రంగారావు, రైతులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** నదీ పరివాహక ప్రాంతాలలోని లంక భూముల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. చల్లపల్లి మండలంలోని వెలివోలు, నిమ్మగడ్డ, నడకుదురు, నాదెళ్ల వారి పాలెం, రాముడు పాలెం,ఆముదర్లంక గ్రామాలలో మల్బరీ తోటలు, అరటి, పసుపు, కూరగాయ తోటల రైతులు తీవ్రంగా నష్టపోయారు. లంక భూమిల్లో విద్యుత్ మోటర్లు పాడైయ్యాయి. నడకుదురులో ఇటుక బట్టీలు. పద్దేశ్వర దేవాలయం, రాముడు పాలెం లోని రొయ్యల హేచరీ, పూర్తిగా మునిగిపోయాయి. వెలివోలు లో మల్బరీ తోటలు 35 ఎకరాలు నీట మునిగిపోగా పసుపు, కంద అరటి తదితర పంటలు 200 ఎకరాలు నట్లు మునిగినట్లు చల్లపల్లి తాసిల్దార్ తెలిపారు. ఆముదారలంక నుండి 50 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు వివరించారు. ముంపు గురైన వరి పంట పొలాలను మండల వ్యవసాయ అధికారిణి జి.సాయి సింధు పరిశీలించారు. రైతులకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. **ప్రజాశక్తి- కోడూరు :** కోడూరు మండలం ఉల్లిపాలెం వద్ద కష్ణానది కరకట్ట బలహీనపడిన నేపథ్యంలో దాదాపు 120 మీటర్లు పొడవునా కరకట్ట బలోపేతం చేసే పనులు చేపట్టారు. ఆదివారం రాత్రి ఈ ప్రాంతంలో నెలకొన్న సమస్యను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తన యుడు, మండలి వెంకట్రామ్ రాత్రి పరిశీలించి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఈ పనులను సోమవారం మధ్యాహ్నం మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్ కుమార్, పనులు పరిశీలించారు. **ప్రజాశక్తి మోపిదేవి :** మండలంలోని బొబ్బర్లంక కొక్కి లగడ్డ కొత్తపాలెం గ్రామాల మధ్య అవనిగడ్డ నుంచి విజయవాడ వెళ్లే కలకత్తా రహదారికి సమాంతరంగా వరద నీరు చేరుకోవడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవు తున్నారు. కరకట్ట రహదారిపై 100 మీటర్ల మేర తారు రోడ్డు అంచువరకు వరద నీరు చేరింది. దాదాపు ఐదారు టిప్పర్లు ఇసక తెప్పించి సిద్ధంగా ఉంచారు. జలదిగ్బంధంలో చిక్కుకున్న మోపిదేవి మండలంలోని కే. కొత్తపాలెం, బొబ్బర్లంక గ్రామాల్లో పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ పర్యటించారు. ఆహారపొట్లాలు బిస్కెట్లు, రొట్టెలను యుద్ధ ప్రాతిపదికన సిద్దంచేసి కట్టల మీద, పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి పంపిణీ చేశారు. అలాగే వరద ప్రభావిత ప్రాంతాల్లో మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు పర్యటించారు. **ప్రజాశక్తి - గుడివాడ :** నందివాడ మండలంలో బుడమేరు పొంగడంతో పుట్టగుంట వద్ద వరద నీరు రహదారులపై వచ్చింది. దీంతో గుడివాడ నుండి హనుమాన్ జంక్షన్ వైపు వెళ్ళు వాహనాలను అలాగే నూజివీడు, ఏలూరు, హనుమాన్ జంక్షన్ నుండి గుడివాడ, మచిలీపట్నం పామర్రు వైపు వెళ్ళే వాహనాలను నిలిపి వేసి ప్రత్యామ్నాయ రహదారి గుండా వెళ్ళాలని పోలీసులు వాహనాలను దారిమళ్ళిస్తున్నారు. ఇదిలా ఉండగా బుడమేరు పొంగడంతో బుడమేరు సరిహద్దు గ్రామాలైన పెద్ద లింగాల, చిన్నలింగాల, చేదుర్తిపాడు, ఒద్దులమెరక, పుట్టగుంట తదితర గ్రామాల్లో పంట పొలాలు, ఇళ్లన్నీ నీటితో మునిగిపోవడంతో అధికారులు అప్రమత్తమై ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఇదిలా ఉండగా అనమనపూడి ఎస్సి కాలనీ వర్షపు నీటిలో చిక్కుకుంది. మండలంలో చేదుర్తిపాడు, చినలింగాల, పెదలింగాల, పుట్టగుంట, పోలుకొండ గ్రామాలలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డిప్యూటి తహశీల్దారు డి మల్లిక తెలిపారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** వరదలలో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర నాయకులు ఎం హరిబాబు విజ్ఞప్తి చేశారు. కంకిపాడు మండలం మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాలలో సిపిఎం నాయకులు పర్యటించి రైతులను వరద బాధితులతో మాట్లాడారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించి ,యుద్ధ ప్రాతిపదికన పంట నష్టాన్ని అందించాలన్నారు. పంటలను పరిశీలించిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పంచకర్ల రంగారావు, సిపిఎం మండల నాయకులు టి నరేష్, పి. దుర్గారావు, వి శివశంకర్, సిహెచ్ శ్రీహరి పాల్గొన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధి గ్రామాల్లోని వరద ముంపుకి గురైన ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపా ధ్యక్షులు దనేకుల మురళీమోహన్ రావు పర్యటించి నిరాశ్ర యులైన వారికి అవసరమైన ఆహారం, పండ్లు అందించారు.



తోట్లవల్లూరు మండలంలో పర్యటిస్తున్న హరిబాబు



గన్నవరం మండలం కేసరపల్లిలో నీట మునిగిన ఇళ్లు

బుడమేరు కట్టకు గండి

విజయవాడ నుండి వస్తున్న భారీ వరద కారణంగా మండలంలోని వేల్పురు, ఉప్పలూరు వద్ద రెండు చోట్ల బుడమేరు కట్ట తెగింది. దీంతో వందలాది ఎకరాల్లో పంట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే కంకిపాడు-గన్నవరం ప్రధాన రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. **పెనమలూరు :** యనమలకుదురు నుంచి పెద్ద పులిపాక, చౌడవరం వరకు గల బాధితులకు దాదాపు రెండువేల పైచిలుకు వరద బాధితులకు పులిహార, పెరుగన్నం, వెజిటబుల్ బిర్యాని మంచినీటిని రాయల్స్ క్లబ్ విజయవాడ వారు అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు షేక్ మస్తాన్ వలి షేక్ ఖాసిం ఉప్పాడ త్రిమూర్తులు పాల శ్రీను మాధవ కొండలరావు, రాయల్ క్లబ్ కార్యదర్శి ఒట్టి గణపతి, అర్జా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా)

జిల్లాలో వర్షం రాకపోయినప్పటికి, వరద నీరు తగ్గుముఖం పట్టేంతవరకు అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో వరద నీటి ప్రభావంపై సమావేశం నిర్వహించి రేఖ చిత్రపటం గమనిస్తూ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదన్నారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ నుండి 11.43 లక్షల క్యూసెక్కుల నీరు కష్ణా నది దిగువకు వదిలారన్నారు. దిగువ ప్రాంతాలకు వరద నీరు తగ్గుముఖం పట్టేంతవరకు అధికారులు ఎవరూ కూడా విశ్రమించకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా జలవనరుల శాఖ డ్రైనేజీ శాఖ అధికారులు వాగులు వంకల వద్ద రాకపోకలు సాగకుండా గట్టిగా నియంత్రణ చర్యలు కొనసాగించాలన్నారు. కాలువలపై నిరంతర నిఘా ఉంచి గండ్లు పడకుండా పర్యవేక్షిం చాల న్నారు. ఇన్చార్జి డిఆర్ఓ జి శ్రీదేవి, జడ్పీ సీఈవో ఆనంద్ కుమార్, ఆర్ డబ్ల్యు ఎస్ ఈఈ శివప్రసాద్, డిఇఓ తహేరా సుల్తానా, డీఎస్ఓ పార్వతి, డిఎంహెచ్వో డాక్టర్ గీతాబాయి, డి సిహెచ్ ఎస్ డాక్టర్ శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

జిల్లాలో భారీ వరద ఉధతి కారణంగా జిల్లా కలెక్టర్ డికె.బాలాజీ ఆదేశాలతో మంగళ వారం అనగా 3 వతేదీ కష్ణా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు శెలవు ప్రకటించాని జిల్లా విద్యాశాఖాధికారి తాహేరా సుల్తానా తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణాజిల్లా
మంగళవారం
3 సెప్టెంబర్ 2024

జల విలయం


విజయవాడ కృష్ణలంక వద్ద వరద ఉధృతి


విజయవాడ కృష్ణలంక వరద బాధితులను తరలిస్తున్న దృశ్యం


విజయవాడ కృష్ణలంక వద్ద నీరు రాకుండా ఇసుక బస్తాలు వేస్తున్న దృశ్యం


విజయవాడ కృష్ణలంకలోకి వచ్చిన వరద నీరు


మైలవరం మండలంలో కోతకు గురైన రోడ్డు


తోట్లవల్లూరు మండలంలో వరద బాధితులను పరామర్శిస్తున్న మంత్రి సవిత, వర్ల కుమార్ రాజా


కంకిపాడు మండలంలో మునిగిన పంటలు పరిశీలిస్తున్న నాయకులు ఎం.హరిబాబు




వరద బాధితులకు ఆహారం అందిస్తున్న
ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కురి శ్రీనివాసరావు


ఉయ్యూరు మండలంలో పొలాలు పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు


ఉంగుటూరు మండలంలో కోతకు గురైన రహదారి


తోట్లవల్లూరు మండలంలో వరద బాధితులను తరలిస్తున్న దృశ్యం


యనమలకుదురులో వరద బాధితులకు ఆహారం అందిస్తున్న దృశ్యం


విజయవాడలో వరద బాధితులకు ఆహార పొట్లాలు అందిస్తున్న దృశ్యం


కంకిపాడు మండలంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు


గన్నవరం మండలం కేసరపల్లిలో వరద బాధితులను తరలిస్తున్న దృశ్యం


గన్నవరం మండలంలో ఏలూరు కాల్వకు పడిన గండి


ఇబ్రహీంపట్నంలో నీట మునిగిన ఇళ్లు


జగ్గయ్యపేటలో కోతకు గురైన జాతీయ రహదారి


కంచికచర్లలో పడవలపై వరద బాధితులను తరలిస్తున్న దృశ్యం


గుడివాడలో...


అవనిగడ్డలో వరద నీరు రాకుండా ఇసుక బస్తాలు వేస్తున్న దృశ్యం


చల్లపల్లిలో చెరువులను తలపిస్తోన్న పంట పొలాలు


గుడ్లవల్లేరు మండలంలో నీట మునిగిన పొలాలు


బంటుమిల్లిలో మునిగిన పంటలు పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

తగ్గుముఖం పట్టిన మునేరు వాగు

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మండలం ఐతవరం గ్రామం వద్ద మున్నేరు వరద తో తగ్గడంతో 65 వ నెంబరు జాతీయ రహదారి పైఆగిపోయిన వాహనాల రాకపోకలను అధికారులు సోమవారం సాయంత్రం పునరుద్ధరించారు. మునేర్కు వరద తగ్గటంతో వాహనాలు జనం రాకపోకలకు అనుమతించారు. పోలీసులు దగ్గరుండి ఒక్కొక్క వాహనాన్ని వరద దాటించి పంపిస్తున్నారు. ఐతవరం వద్ద మునేరు వారు తగ్గుముఖం పట్టింది. జాతీయా రహదారిపై గడిచిన రెండు రోజులుగా కురిసిన వర్షాలకు వరద ఉధతి పొంగి విజయవాడ, హైదరాబాద్ల వైపు రాకపోకలు నిలిచిపోయాయి. వాహనదారులు ప్రయాణికులు ప్రజలు చాలా అసౌకర్యానికి గురైన్నారు. ఈ వరద ఉధతిలో దాదాపుగా ఆరు వాహనాలు కార్లు వరద లో చిక్కు కొని కొట్టు పోయినాయి. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. అయితే ప్రస్తుతం సాయంత్రం 5 గంటల నుండి వరద ఉధృతి తగ్గడం వల్ల అగ్నిమాపక దళం వాహనంలో ప్రయాణికులను అస్వస్థతకు గురైన వాళ్లను అగ్నిమాపక దళం వాహనంలో ఐతవరం నుండి విజయవాడకు తరలించారు.

గ్యాస్ పైప్‌లైన్ లీక్

ప్రజాశక్తి-మైలవరం: గ్యాస్ సరఫరా చేసే పైపులైను లీకేజీ అవడంతో స్థానికులు భయాందోళన గురయ్యారు. ఈ సంఘటన ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండల పరిధిలోని వెల్వడం అడ్డరోడ్డు హై స్కూల్ వద్ద సోమవారం జరిగింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలుకు రహదారులు ధ్వంసం అవ్వటంతో భూమిలో వేసిన గ్యాస్ సరఫరా చేసే పైపులైన్‌కు లీకులు ఏర్పడి గ్యాస్ బయటకు వచ్చింది. దీంతో స్థానికులు భయాందోళన గురై పరుగులు తీశారు. సకాలంలో అధికారులు స్పందించి గ్యాస్ సరఫరా వారికి సమాచారం ఇచ్చి గ్యాస్ సరఫరాను నిలిపివేయడంతో దానిలో ఊపిరి పీల్చుకున్నారు. దీంతో పెనుప్రమాదం తప్పినట్లు అయింది.

మట్టి గణపతి విగ్రహాలను వినియోగించాలి

ప్రజాశక్తి-తిరువూరు: రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో మట్టి గణపతి విగ్ర హాలను పూజించాలని తిరువూరు తహశీల్దార్ కె.లక్ష్మి అన్నారు. సోమవారం తహశీల్దర్ కార్యాలయంలో మట్టి వినాయక



విగ్రహాల ఆవశ్యకతను తెలుపుతూ జన విజ్ఞానవేదిక రూపొందించిన కరపత్రాలను తహశీల్దార్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేసిన విగ్రహాలు నీటి లో త్వరగా కరగవని, చెరువులు, కాలువలలో పూడిక పేరుకుని సాగునీటి సామర్థ్యం తగ్గుతుందన్నారు. వినా యక విగ్రహాలకు పూసే విష రసాయనాల వల్ల తాగునీ రు కలుషితం అవుతుందని, పర్యావరణానికి చేటు చేయడమే కాకుండా ప్రజారోగ్యంపై కూడా దుష్ప్రభావం చూపుతోందని తహశీల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ బి. మోహన్, జెవివి ప్రతినిధులు ఎల్ గంగాధర్, ఎం హరికృష్ణ, ఎం.రాంప్రదీ ప్, కె పాపారావు, ఎం.సుధాకర్, ఎం.రమేష్, పి. వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో రామలింగేశ్వరనగర్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: భారీ వర్షాలు, వరదల కారణంగా నగరంలోని రామలింగేశ్వరనగర్, యనమలకుదురు తదితర ప్రాంతాలలో భారీగా నీరు చేరుకోవడంతో పరిసర ప్రాంత ఇళ్లనీ మునిగిపోయాయి. దీనితో అధికారులు హుటాహుటిన ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సోమవారం ఉదయం నుండి రామలింగేశ్వరనగర్‌లో వరద నీరు భారీగా రావడంతో పటమటలంకలోని మునిసిపల్ పాఠశాలకు బాధితరులు తరలించారు. సుమారు 400 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. పునరావాస కేంద్రాలలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆహార సదుపాయంతో పాటు,త్రాగునీరు అన్ని అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. ముంపు ప్రాంతాలకు గురైన రామలింగేశ్వరనగర్, రాణిగారితోట పరిసరప్రాంతాలను సోమవారం ఉదయం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటించారు. ముంపు ప్రాంత వాసులను పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. అలాగే అవసరమైన వారిరి ఆహారం, ఇతర సదుపాయాలు కల్పించాల్సిందిగా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని అన్నారు.

ఇబ్రహీంపట్నంను ముంచెత్తిన వరద

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఎగువ నుంచి వస్తున్న కృష్ణమ్మ ఇబ్రహీంపట్టణాన్ని అన్ని వైపుల నుంచి ముంచెత్తింది. మండలంలోని చిలుకూరు, దాములూరు, కొటికలపూడి, కిలేశపురం, జూపూడి, ఇబ్రహీంపట్నం తదితర గ్రామాలు జల దిగ్బంధనంలో చిక్కుకున్నాయి. విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారిపై పలుచోట్ల వరద నీరు రావడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. ఆదివారం సాయంత్రం నుంచి వచ్చిన వరదతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మైలవరం శాసన సభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రజలను కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయిడు పర్యటించారు. ఇబ్రహీంపట్నం మండలంలోని జూపూడి, కిలేశపురం, మూలపాడు ఇబ్రహీంపట్నం గ్రామాల్లో సిఎం చంద్రబాబుతో కలిసి మంత్రులు తానేటి వనిత, నారాయణ, కొల్లు రవీంద్ర, యంపి కేశినేని శివనాద్ (చిన్ని) పర్యటించారు. వరద ఉధృతి పెరిగిన సమయంలో కృష్ణానది పెదలంక వరదలో 30 మంది బాధితులు చిక్కుకుపోయినట్లు సమాచారం. భవనం పైకి ఎక్కి కాపాడమంటూ హాహాకారాలు చేశారు. స్థానికులు వారిని పడవలపై సురక్షితంగా ఫెర్రీకి చేర్చారు. ఓ వైపు కృష్ణమ్మకు వరద నీటి ప్రవాహం పెరగడంతో బాధితుల్లో ఆందోళన మరింత పెరిగింది.

విపత్కర పరిస్థితుల్లో పడవలు కరువు

ఇబ్రహీంపట్నం ఫెర్రీలో నిత్యం అనేక పడవలు ఘాట్లో దర్శనం ఇస్తాయి. కానీ వరద ఉధృతిలో చిక్కుకొని ఉన్న ఫెర్రీ ప్రజలను కాపాడటానికి మాత్రం పడవల కరువు అవటం దారుణమని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో వరదల్లో చిక్కుకున్న వారిని ఒడ్డుకు చేర్చడానికి అవసరాన్ని బట్టి, డిమాండ్‌ను బట్టి

ఎన్‌టిపిఎస్‌కు పొంచి ఉన్న ముప్పు

రూ.1500 నుండి 10 వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు తెలిపినా స్పందించడంలేదని బాధితులు చెబుతున్నారు. గాజులపేట, పశ్చిమ ఇబ్రహీంపట్నం ప్రాంతంలోని ప్రజలు విజయవాడ హైదరాబాద్ జాతి రహదారి పైనే పడిగాపులు పడుతున్నారు.

సిపిఎం బృందం నిరసన

ఇబ్రహీంపట్నం ఫెర్రీలో వరదలో చిక్కుకున్న వారిని పడవల ద్వారా ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం ద్వారా సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వరదలు వస్తాయని తెలిసిన ఇప్పటి వరకు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం రాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిఎం ఆదేశాలు జారీ చేసినా అధికారులు స్పందించకపోవడం విచారకరమని సిపిఎం మండల కార్యదర్శి ఎం.మహేష్ అన్నారు. వరదలో చిక్కుకున్న వారిని కాపాడలేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాచవరంలో ఒకరు గల్లంతు

చిలుకూరు గ్రామంలోకి వరద నీరు చొచ్చుకెళ్లింది. ఓ వైపు ఏనుగు గడ్డ వాగు, మరోవైపు కృష్ణమ్మకు వస్తున్న వరద ప్రవాహం పోటెత్తి గ్రామాన్ని చుట్టేసింది. ఇళ్లలోకి నీరు చేరింది. రహదారులు, పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. కాచవరంలో ముగ్గురు యువకులు ఈతకు వెళ్లగా అందులో జి.మంజి (24) గల్లంతు అయినట్టు సమాచారం. విజయవాడ రూరల్ మండలం లోని గొల్లపూడి గ్రామపంచాయతీ నల్లగుంట గ్రామ సమీపంలో జాతీయ రహదారి 95 రోడ్డు పక్కన పంట కాలవలో గుర్తు తెలియని మృతదేహం కాలువలో



జాతీయ రహదారిపై నిలిచిన నీరు



సిపిఎం నిరసన

కొట్టుకొచ్చింది.

విటిపిఎస్‌కు పొంచి ఉన్న ముప్పు

డాక్టర్ ఎన్‌టిపిఎస్ లోపలికి వెళ్లే కూలింగ్ కెనాల్ గేట్లు డ్యామేజ్ అయినట్లు సమాచారం. విటిపిఎస్‌లోకి వరద నీరు ప్రవహిస్తుంది. దీని వలన విటిపిఎస్‌కు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. ఇబ్రహీంపట్నం ఫెర్రిలో వరద బాధితులను తీసుకువస్తున్న పడవ బోల్తా పడింది. వెంటనే పడవ యజమానులు అప్రమత్తతో వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. బాధితులు సురక్షితంగా ఉండటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం సాయంత్రం ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కొటికలపూడి గ్రామాన్ని కృష్ణానది వరద ముంచెత్తడంతో స్థానిక నాయకులు అధికారులతో కలిసి ఎమ్మెల్యే పడవపై కొటికలపూడి గ్రామానికి చేరుకున్నారు. గ్రామస్తులతో మాట్లాడి వారికి భరోసా కల్పిస్తూ ధైర్యం చెప్పారు.



తిరువూరులో...

చెరువులను తలపిస్తున్న రోడ్లు

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు మండలంలో వరద ముంపుకు గురైన ప్రాం తాల్లో అధికారులు తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే కన్పిస్తున్నాయి. బ్రిడ్జిల పైకి పొంగి వరద ప్రవహిస్తున్న వాగుల వద్ద అధికార యంత్రాంగం మచ్చుకైనా జాడలేదు. తిరువూరు మండలంలోని అక్కపాలెం వంతెనపై నుండి వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. తిరువూరు నుండి అక్కపాలెం వెళ్లే రహదారి కి ఇరువైపులా మల్లమ్మ చెరువు, కనుముల చెరువు ఉన్నాయి. ఈ రెండు చెరువులు పొంగి రోడ్డుపై చిన్నపాటి చెరువును తలపించేలా వరద ప్రవ హిస్తుంది. వంతెన వద్ద గానీ, రెండు చెరువులు వద్ద గానీ అధికార యంత్రాంగం కనుచూపుమేరలో కూడా కనిపించదు.

గానుగపాడు నుండి టేకులపల్లి వచ్చే రహదారి మధ్యలో ఉన్న బ్రిడ్జి వద్ద రోడ్డు పూర్తిగా తెగిపోయింది.

పారిశుధ్య పనులు ముమ్మరం

ప్రజాశక్తి-విస్సన్నపేట: కూటమి యువ నాయకులు ఆధ్వర్యంలో పట్టణంలో యుద్ధ ప్రాతిపదికన చురుగ్గా పారిశుధ్య పనులు నిర్వహించారు. డ్రైన్లను జెసిపి సహాయంతో చెత్తను తొలగించి వరద నీరు నిలవకుండా ఉండేవిధంగా పారిశుధ్య కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ప్రభుత్వ హాస్పటల్ అభివద్ధి కమిటీ డైరెక్టర్ మురుగుల ప్రసాద్, ముత్తంశెట్టి వంశీ రామ్, ఈవో హరికృష్ణ కుమార్ పాల్గొన్నారు. శ్రీ లలిత సూపర్ మార్కెట్ ఆధ్వర్యంలో తాసిల్దార్ కె.లక్ష్మీకళ్యాణి చేతుల మీదుగా వాటర్ బాటిల్స్‌ను వరద బాధితులకు పంపిణీ చేశారు.





పంట పొలాలు పరిశీలన

ప్రజాశక్తి-వీరులపాడు: రంగాపురం గ్రామానికి ఏనుగుడ్డ వాగు వరద వల్ల మొక్కజొన్న పంటలను సోమవారం సిపిఎం నాయకులు పరిశీలించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏనుగడ్డ వాగు పొంగడంతో గూడెం మాధవరం, పెద్దాపురం, అల్లూరు, రంగాపురం, జుజ్జూరు, నరసింహారావుపాలెం గ్రామాల్లో పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటలు పూర్తిగా ధ్వంసమయ్యాయని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు లాల్ అహ్మద్ గౌస్, మంగళపూడి సుందర్రావు పాల్గొన్నారు.

ఎటు చూసినా నీరే...




ప్రజాశక్తి-కంచికచర్ల: కృష్ణా నదికి వరద ఉధృతి కారణంగా నది పరివాహక గ్రామాలు జలదిగ్బంధనంలో ఉన్నాయి. గ్రామాలలో పొలాలలో ఎటు చూసినా నీళ్లే కనిపిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఇళ్ల నుండి బయటకు వచ్చే మార్గాలు కనుమరుగయ్యాయి. సోమవారం ఉదయానికి గ్రామాల్లో భారీ ఎత్తున వరద నీరు చేరటంతో లోతట్టు ప్రాంత ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మొగులూరు, మున్నలూరు, చెవిటికల్లు, ఆతుకూరు, కొత్తపేట గ్రామాలను వరద నీరు ముంచెత్తింది. పడవల ద్వారా అధికారులు ఆయా గ్రామాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. కొత్తపేట, ఆత్కూరు చెవిటికల్లు గ్రామాల్లో పల్లపు ప్రాంతాలలో ఆరేడు అడుగుల పైగా వరద నీరు ప్రవేశించింది. వైరా ఏరు, కట్టలేరు ఉదతంగా ప్రవహిస్తుండటంతో మున్నేరు ఉప్పొంగిది. కష్ణానదికి వరద పోటెత్తడంతో మునేరు వరద కష్ణా నదిలో కలిసేందుకు అవకాశాలు లేక పొలాల గుండా గ్రామాలను చుట్టుముట్టింది. కంచికచర్ల తాహసిల్దార్ జాహ్నవి, డిప్యూటీ తాహసిల్దార్ నాగుల్ మీరా, ఎంపీడీవో కె. శిల్ప, సిఐ డి. చవాన్, ఎస్సై రాజు, వివిధ శాఖల సిబ్బంది గ్రామాల్లోనే మకాం వేసి సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. నందిగామ ఏసిపి డాక్టర్ రవికిరణ్ సోమవారం ఉదయాన్నే మండలంలోని వరద ముంచెత్తిన గ్రామాలకు పడవ ద్వారా చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు. పడవల ద్వారా వరద ప్రాంతాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు.

వాహనాల రాకపోకలు బంద్

భారీ వర్షాల కారణంగా వరదలు పోటెత్తి రహదారులపై వరద నీరు చేరటంతో 65 నెంబర్ జాతీయ రహదారిపై అధికారులు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. పరిటాల చెరువుకు గండిపడి కంచికచర్ల విజయవాడ మార్గంలో వాహనాల రాకపోకలు బంద్ అయ్యాయి. ఐతవరం వద్ద రహదారిపై వరద నీరు చేరటంతో కంచికచర్ల మీదుగా వాహనాల రాకపోకలు అధికారులు బంద్ చేశారు. ఇటు ఇబ్రహీంపట్నం నుండి, అటు నందిగామ నుండి వాహనాలను వెనకకు మళ్లిస్తున్నారు. దీంతో విజయవాడ హైదరాబాద్ మార్గంలో రాకపోకలు బంద్ అయ్యాయి. భారీ వర్షాల కారణంగా గ్రామాలను వరద నీరు ముంచెత్తడంతో పలు గ్రామాలకు కంచికచర్ల తో సంబంధాలు తెగిపోయాయి. కంచికచర్ల చెవిటికల్లు మార్గంలో గత మూడు రోజులుగా రాకపోకలు బంద్ అయ్యాయి. అదేవిధంగా కీసర పెండ్యాల మార్గంలోనూ, కీసర గండేపల్లి మార్గంలోనూ రోడ్లపైకి వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు బంద్ అయ్యాయి. మండలంలో ఏనుగడ్డ వాగు ఇంకా ఉధతంగా ప్రవహిస్తూనే ఉంది. తోలవాగు సుద్ద వాగులు సైతం వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తూనే ఉన్నాయి.

ముంపు బారిన తండాలు

వాగులో కొట్టుకుపోయిన వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న స్థానికులు

పున్నయ్య

ప్రజాశక్తి-ఎ.కొండూరు: పశువులు మేపటానికి పొలం వెళ్లి తిరిగి వస్తుండగా వరదలో చిక్కుకొని ఒక వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని రామచంద్రపురం సమీపాన ఉన్న పెద్ద వాగులో చోటుచేసుకుంది. రామచంద్రపురం గ్రామానికి చెందిన ఆర్థ పున్నయ్య (69) శనివారం ఉదయం పశువులను మేపటానికి పొలం వెళ్లాడు. అదే రోజు సాయంత్రం పశువులను తోలుకొని ఇంటికి వస్తుండగా గ్రామ సమీపాన ఉన్న పెద్ద వాగును దాటే ప్రయత్నంలో వరదలో కొట్టుకుపోయాడు. శనివారం రాత్రి పశువులు మాత్రమే ఇంటికి వచ్చి పున్నయ్య ఇంటికి రాకపోవడంతో ఆదివారం వరకు కుటుంబ సభ్యులు పెద్దవాగు వెంబడి వెతికారు. సోమవారం ఉదయం మృతదేహం వాగులో చెట్లలో చిక్కుకొని ఉండడానికి గమనించి మృతదేహాన్ని అతి కష్టం మీద బయటకు తీసుకొచ్చారు. పున్నయ్యకు భార్య, ఆరుగురు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎ.కొండూరు ఎస్సై చల్లా కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుంబాన్ని టిడిపి మండల అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి పరామర్శించారు.

మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పెద్దతండ గ్రామపంచాయతీలో గిరిజనులకు చెందిన ఇంటి గోడలు కూలిపోయాయి. ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. వరద ముంపుకు గురైన ప్రాంతాల్లో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సోమవారం పర్యటించారు. ఏ కొండూరులోని ఎన్టీఆర్ కాలనీ అడ్డరోడ్డు సమీపాన ఉన్న చైతన్య నగర్ తండాలలో వరద ముంపుకు గురైన గృహాలను ఎమ్మెల్యే పరిశీలించి బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. చైతన్య నగర్ తండాలో వరద ముంపు బాధితులకు సమీపానే ఉన్న మార్కెటింగ్ యార్డులో వసతి ఏర్పాటు చేసి వారికి భోజన వసతులు సమకూర్చారు. అలానే గోపాలపురం తండాలో మోటార్ సైకిల్‌పై వీధుల్లో పర్యటించిన ఆయన అక్కడ ప్రజలు తాగుతున్న రక్షిత మంచినీటి వాటర్ ట్యాంకును ఎక్కి ట్యాంక్‌లోని నీటిని పరిశీలించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సోమవారం ఏ కొండూరులో తాగు నీటి పరీక్షలు నిర్వహించినట్లు ఆర్డబ్ల్యుఎస్ ఏఈ లక్ష్మి తెలిపారు. తాగునీటిలో ఆల్కె లినిటీ , పీహెచ్, ఫ్లోరైడ్, క్లోరైడ్, ఫ్లోరిన్, నైట్రేట్, ఐరన్, తదితర పరీక్షలు నిర్వహించినట్లు ఎఈ తెలిపారు.



వరద బాధితులకు భోజనం

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల కేంద్రంలో వరద బాధితులకు టిడిపి నాయకులు భోజన వసతి కల్పించారు. టిడిపి యువ నాయకుడు బొమ్మిన కోటేశ్వరరావు, సాయిరాం మ్యాంగో మార్కెట్ అధినేత, టిడిపి నాయకులు గోగులమూడి రవీంద్ర రెడ్డి ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు మాతంగి రామారావు, చాట్ల అచ్చియ్య, చాట్ల బాబురావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే వికాస్ కాలేజీలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఉన్న వారికి టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి భోజన ఏర్పాట్లు చేశారు. రెడ్డిగూడెం మండల కేంద్రంలో గల వికాస్ కాలేజీలో ఏర్పాటు చేసిన వరదబాధితుల పునరావాస కేంద్రాన్ని ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ (ఎఫ్‌ఎస్‌ఎస్) సంస్థ నిర్వాహకులు చాట్ల విజయకుమార్ సందర్శించారు. బాధితుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సహాయం చేసిందని తెలిపారు. అలాగే వైద్య సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారని తెలిపారు.

స్తంభించిన రాకపోకలు



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల గరికపాడు వద్ద గల పాలేరు నదిపై నిర్మించిన బ్రిడ్జి (జాతీయ రహదారి 65) కోతకు గురైంది. దీనితో ఇరు రాష్ట్రముల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సోమవారం ఉదయం ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్ క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను అక్కడ ఉన్న వారిని అడిగి తెలుసుకున్నారు. కోతకు గురైన బ్రిడ్జిని జాతీయ రహదారిల రీజినల్ అధికారి సాయి కుమార్ సోమవారం పరిశీలించారు. పట్టణంలోని మిట్ట గూడెం శివాలయం సెంటర్ వద్ద మూడవరోజు వరద ముంపు ప్రాంతాలలో జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య పర్యటించారు. పాలేరు బ్రిడ్జి వద్ద పదుల సంఖ్యలో నిలిచిపోయిన లారీలను గమనించిన జగ్గయ్యపేట నియోజకవర్గ చిరంజీవి యువత అధ్యక్షులు వల్లపునేని గోవిందరావు డ్రైవర్లకు భోజన సదుపాయం కలిపించారు. జనసేన నాయకులు షౌకత్ అలీ, రాష్ట్ర చిరంజీవి యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ మోసిన్ అహ్మద్ చేతులు మీదుగా భోజనాలను అందజేశారు. పట్టణంలోని స్థానిక ఆర్టీసీ కాలనీలో వరద ముంపు ప్రాంతాలను సోమవారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పరిశీలించారు. మండలంలోని గరికపాడు కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ కృష్ణంరాజు ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు ముంపు ప్రాంతాలైన తక్కెళ్లపాడు, బలుసుపాడు, అన్నవరం గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ఖమ్మం-మహబూబాబాద్ మధ్యలో ట్రాక్ కొట్టుకుపోవటం వల్ల మధిర-మోటమర్రి నుండి జగ్గయ్యపేట మీదుగా మేళ్లచెరువు, విష్ణుపురం, మిర్యాలగూడ, నల్లగొండ, చిట్యాల మీదుగా సికింద్రాబాద్‌కు రైళ్లను తరలిస్తున్నారు.



ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: మున్నేరు కాజువేపై వరద ప్రవహించడంతో, భారీ వృక్షాలు చెత్త పేరుకుపోవడం మండల కేంద్రంతో పాటు మున్నేరు అవతల ఒడ్డు నున్న గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. స్థానిక గ్రామపంచాయతీ సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, రాష్ట్ర నెడ్ క్యాప్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవి కుమార్, ఎస్ఐ అర్జున్ ఆధ్వర్యంలో జెసిబితో దగ్గర ఉండి భారీ వృక్షాలను, చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాడిస పాపారావు, కార్యనిర్వాహణాధికారి గొర్రెపాటి శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు..

చెరువులను తలపిస్తున్న పంట పొలాలు

ప్రజాశక్తి-నందిగామ: మునేటి వరద ముంపు తో పశ్చిమ కృష్ణా నందిగామ ప్రాంతంలో పంటలకు అపారనష్టం వాటిల్లింది. నందిగామ ప్రాంతంలో ఎటు చూసిన కూడా పంట పోలాలు పూర్తిగా చెరువులు తలపిస్తున్నాయి. మున్నేరు వరద ఉధతి కి నందిగామ మండలం లో పెద్ద ఎత్తున పంట పోలాలు వరద ముంపు గురైనాయి. పత్తి, మిర్చి, మాగాణి, అపరాలు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. నందిగామ ప్రాంతంలో సుమారు 70 వేల హెక్టార్లలో పత్తి, 50 వేల హెక్టార్లలో మిర్చి, లక్ష హెక్టార్లలో మాగాణి, 50 వేల హెక్టార్లలో అపరాలు పంటలు పూర్తిగా నీటమునగటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. యకరానికి 30 వేల రూపాయిల నుండి 50 వేల రూపాయిల వరకు పెట్టుబడులు పెట్టి నష్టపోయామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడులు రావని రైతులు కన్నీళ్ల పర్యవంత మవుతున్నారు. పంట నష్టము వేయటానికి కూడా అంచనాలకు అందని రీతిలో పంట పోలాలు పూర్తిగా నీట మునిగాయి. గత మూడు రోజుల నుండి పంట పోలాలు పూర్తిగా నీట మునగటంతో పత్తి పంట పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. పత్తి పంట పోలాలు బురద పట్టింది. మాగాణి పంట పోలాలు పూర్తిగా నీట మునగటంతో వరి నారు వరదకు కొట్టుకు పోయింది. తిరిగి వరి నారు వేసుకోవడానికి యకరానికి పదివేల రూపాయల ఖర్చు అవుతుందని రావపావురం గ్రామ కౌలు రైతు రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. కౌలు రైతు లు పూర్తిగా వరదలకు నష్టపోవడం జరిగింది. వ్యవసాయ అధికారులు తక్షణమే స్పందించి నందిగామ ప్రాంతంలో నష్ట పోయిన పంటలను నష్ట పరిహారం అంచనావేసి రైతులను ఆదుకోవాలని కౌలు రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు డిమాండ్ చేశారు.



కంచికచర్లలో అపరాల పంటలు



నందిగామలో మునిగిన పంటలు

మొలకెత్తిన అపరాల పంటలు

ప్రజాశక్తి-కంచికచర్ల: భారీ వర్షాలు, వరదలకు కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో పంటలన్నీ తుడుచుపెట్టుకుపోయాయి. ఈ రెండు మండలాల్లో పెసర, మినుము కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో రెండు రోజులు తెరిపిస్తే అపరాల పంటలు ఇంటికొచ్చేవి. కేవలం 48 గంటల పాటు కురిసిన భారీ వర్షంకు పంటలు నీటమునిగాయి. శనవారం, ఆదివారం, కష్ణ నది, మునేరు, కట్టలేరు, వైరా ఏరుతోపాటు. వాగులు వంకలు పొంగటంవల్ల పంటలు పూర్తిగా కొట్టుకుపోయాయి.పొలాల్లో కోతకొచ్చిన పెసర, మినుము, మొలకెత్తి పోయింది . మొక్కజొన్న, పత్తి, వరి పూర్తిగా నీట మునిగింది. పంట నష్టం అంచనా కడా వేసే పరిస్థితుల లేవు. చేతికందాల్సిన పంట భారీ వర్షం, వరదల పాలు కావటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. కోట్లాది రూపాయల పంటల నష్టం వాటిల్లింది.

రహదారులు ధ్వంసం

ప్రజాశక్తి-మైలవరం: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మైలవరం నియోజకవర్గంలోని పలు రహదారులు, ధ్వంసమయ్యాయి. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రాకపోకలు స్తంభించి పోవటంతో స్థానికులు పలు ఇబ్బందులకుగురవుతున్నారు. మైలవరం మండలంలోని చంద్రగూడెం నుండి జంగాలపల్లి, వెళ్లే రహదారి కోతకు గురవడంతో సోమవారం జ్వర బాధితుడు షేక్ దావూద్ మైలవరంలోని ఆసుపత్రికే తరలించేందుకు ఇబ్బందులు పడ్డారు. జి కొండూరు మండలం చిన్న నందిగామ, గురాజుపాలెం వెళ్లే రహదారులు ధ్వంసం అవటంతో రాకపోకలు స్తంభించాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. మైలవరంలోని పలువురు వరద బాధితులకు సోమవారం సాయంత్రం అనంతవరం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బొందలపాటి సుధాకర్ ఏర్పాటు చేసిన భోజన ప్యాకెట్లను తాసిల్దార్ జి బాలకృష్ణారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లంక లితీష్, చారుగొండ్ల ప్రసాద్ పాల్గొన్నారు.



భోజనం అందజేస్తున్న తహశీల్దార్ సుధాకర్

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : భారీ వర్షాలకు, వరదలకు వాగుల్లోకి కొట్టుకువచ్చిన ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను సోమవారం నాడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెద్ద ఎత్తున వచ్చిన వరదలకు నాణ్యమైన ఇసుక వాగుల్లో మేటలు పెట్టి ఉంది. దీన్ని గమనించిన వ్యక్తులు ట్రాక్టర్‌ల ద్వారా తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం 9 ఇంజన్లు, 7 ట్రక్కులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి.మోహనరావు తెలిపారు.



పంట నష్టాన్ని అంచనా వేయండి



ప్రజాశక్తి-నందిగామ: నందిగామ ప్రాంతంలో వరద ముంపుకు గురైన పంటలకు నష్ట పరిహారం అంచనా వేసి రైతులను ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు, సిపిఎం నందిగామ మండల కార్యదర్శి కటారపు గోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కమ్మవారిపాలెం, రాఘవాపురం తదితర ప్రాంతాల్లో వరద ముంపుకు గురైన పత్తి, మిర్చి, మాగాణి, అపరాలు తదితర పంటలను సిపిఎం నాయకులు పరిశీలించారు. కమ్మవారిపాలెం, రాఘవాపురం తదితర గ్రామాలలో వైరా, మున్నేరు నదులు పొంగటంతో సుమారు రెండు వేల ఎకరాలు పంటలు పూర్తిగా నీట మునిగాయి. రైతులు ఖరీఫ్ సీజన్‌కు ఎకరానికి 16 వేలకు పెట్టుబడి పెట్టి పూర్తిగా నష్టపోయారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.గోపాల్, వల్లూరి రవి శేఖర్, కర్రీ వెంకటేశ్వరరావు, ఆకుల వెంకటనారాయణ, జి.గోపీనాయక్, హుస్సేన్, అనీఫ్, జంగా దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

లింగాల వద్ద వరద ఉధృతి



ప్రజాశక్తి-వత్సవాయి: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లింగాల బ్రిడ్జి పై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. వరంగల్ జిల్లా పాకాల చెరువు దగ్గర్నుంచి ఖమ్మం జిల్లా వేదిక పోలంపల్లి చెక్ డ్యామ్ నిండి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. లింగాల బ్రిడ్జి పై 20 అడుగుల మేర వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. చిల్లకల్లు వైరా రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. పాత వేమవరం-పెనుగంచిప్రోలు వెళ్లే రహదారి ఒక కిలోమీటర్ మేర కొట్టుకుపోయింది. అలూరుపాడు సమీపంలో పోలంపల్లి మున్నేరు కాలువకు ఉన్న తెల్ల కాలువ కట్ట తెగిపోవడంతో మునేరు నుంచి వచ్చే వరదతో పంట పొలాలు నీటమునిగాయి. పోలంపల్లి లాకులు వద్ద కుడివైపు గండి పడి మున్నేరులో నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. అధికారులు వెంటనే స్పందించి ఆ గండిని పూడ్చాలని ఆయ కట్టు రైతులు కోరుతున్నారు. చిట్యాల రావి చెట్టు వద్ద ఐదుగురు వ్యక్తులు వివిధ పనుల మీద వచ్చి వరదలో

నేడు విద్యాసంస్థలకు సెలవు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: భారీ వర్షాలు, వరద ఉధృతి కారణంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జ.సృజన ఆదేశాల ప్రకారం మంగళవారం కూడా ఎన్‌టిఆర్ జిల్లాలోని అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు.

కంఠంనేని భారతీదేవి కన్నుమూత

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విద్యావేత్త, శారదా విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ యార్లగడ్డ శారదాదేవి మాతృమూర్తి



కంఠంనేని భారతీదేవి (90) విజయవాడ టీచర్స్ కాలనీలోని స్వగృహంలో సోమవారం ఉదయం కన్నుమూశారు. శారదా విద్యాసంస్థలో చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు భారతీదేవి ప్రతి ఏటా బంగారు పతకాలను అందచేసి ప్రోత్సహించేవారు. కంఠంనేని బాబు రాజేంద్రప్రసాద్, భారతీదేవి ట్రస్ట్ ద్వారా అనేక మంది పేద విద్యార్థులకు ఆమె ఆర్థిక సహాయం అందచేశారు. శారదా విద్యాసంస్థల సలహాదారుడు ఈఎస్‌ఆర్‌కే.ప్రసాద్, జనరల్ మేనేజర్ జీవీ.రావుతో పాటు శారదా విద్యాసంస్థల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది భారతీదేవి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మంగళవారం ఉదయం పది గంటలకు అంతిమయాత్ర మొదలవుతుందని కుటుంబసభ్యులు తెలిపారు.

దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మచిలీపట్నం మండలం చిన్నకరగ్రహారం గ్రామపంచాయతీ కార్యదర్శి నరసింహారావు తెలిపారు. గ్రామంలో విష జ్వరాలు,



డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలడం మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు వల్ల నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెంది వాటి ద్వారా వ్యాధులు ప్రభలుతాయని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా చర్యగా పంచాయతీ సిబ్బంది సహకారంతో దోమల మందు పిచికారి చేశారు. చిన్నకరగ్రహారం గ్రామ పెద్దలు పంచకర్ల శివాజీ, బొడ్డుల పవన్, పర్ధీ, బాబ్జీ, దేవచంద్ర రాజు,కాసులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 350

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్ సరికొత్తగా క్లాసిక్ 350 పేరుతో మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ ఇన్‌ఛార్జి కె.ప్రతాప్ ఒక ప్రక టనలో తెలిపారు. కొత్త 2024 క్లాసిక్ 350 బైక్ అప్‌డేట్ చేసిన నూతన ఫీచర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అబ్బురపరచేకొత్త రంగులలో రు. 1,99,500ల ప్రారంభ ధరతో లభిస్తుందన్నారు. బుకింగ్ ,టెస్టు రైడింగ్ సెప్టెంబరు 1 నుండి ప్రారంభమైందన్నార. హెరిటేజ్, హెరిటేజ్‌ప్రీమియం, సిగ్నల్స్ (కమాండో శాండ్), డార్క్ (గన్ గ్రే అండ్ స్టెల్త్ క్లాబక్) క్రోమ్ (ఎమరాల్డ్) అనే ఐదు కొత్త వేరియంట్లలో, ఏడు ప్రకాశవంతమైన రంగులలో అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. వివరాలకు దగ్గరలోని రాయల్ ఎన్‌ఫీల్డ్ డీలర్ నందు సంప్రదించవచ్చని తెలిపారు.

కెయులో వనమహోత్సవం

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్: కృష్ణా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం కు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వణమహోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య కె శోభన్ బాబు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయం లో పలు రకాల పండ్లు, పుల మొక్కలు నాటేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు అటవీ శాఖ నుండి తీసుకొచ్చిన పదిహేను వందల మొక్కలను విశ్వవిద్యాలయ ఆవరణలో నాటేందుకు చర్యలు చేపట్టామన్నారు.

మూతపడిన విజయ డెయిరీ

• రెండు రోజులకు రూ.70 కోట్లకు పైగా నష్టం

• సంగం పాల ప్యాకెట్లకు డిమాండ్ • పాలబూత్‌ల వద్ద పెరిగిన రద్దీ



ప్రజాశక్తి-విజయవాడ: బుడమేరు వరద విజయ పాల డెయిరీ వ్యాపారంపై తీవ్రమైన ప్రభావం చూపింది. వరద ప్రవాహం భవానీపురం, హౌసింగ్ బోర్డు ఏరియాలను ముంచెత్తింది. ఈ క్రమంలో విజయ పాల డెయిరీలోకి కూడా భారీ ఎత్తున వరద నీరు వచ్చి చేరడంతో యాజమాన్యం డెయిరీని మూసివేశారు. దీని వల్ల వ్యాపారం నిలిచిపోయి ఈ రెండు రోజుల వ్యవధిలోనే డెయిరీకి రూ.70 కోట్లు నష్టం వాటిల్లినట్లు యాజమాన్యం వివరిస్తుంది. డెయిరీ మూతపడటంతో పాల కోసం వరద బాధితులతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉమ్మడి కృష్ణాలో రోజుకు పెద్ద మొత్తంలో ప్యాకెట్లు అమ్మకాలు జరుగుతూ...లక్షలాది రూపాయలు వ్యాపారం జరుగుతుంటుంది. పాలకు గిరాకీ పెరగడంతో హనుమాన్ జంక్షన్‌లోని విజయ డెయిరీ నుంచి వస్తున్న అర లీటర్ పాల ప్యాకెట్ ధర రూ.70కు పైగా పలికినట్లు వినియోగదారులు వెల్లడించారు. అయితే విజయ పాలు కొరత ప్రభావంతో సంగం డెయిరీ పాలకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. సోమవారం ఉదయం 5 గంటలకే కృష్ణలంక, ఇతర ప్రాంతాల్లోని సంగం పాలబూత్‌ల వద్ద వినియోగదారులు బారులు తీరి ఉండటం కనిపించింది. సాధారణంగా సంగం పాల ప్యాకెట్లు వినియోగం ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాలో అంతగా లేనప్పటికీ... విజయ పాలు కొరత కారణంగా వినియోగదారులు చేసేది లేక సంగం పాలవైపు మళ్లక తప్పడం లేదని వినియోగదారులు వ్యక్తం చేస్తున్నారు. విజయాపాల డైరీ మూతపడటంతో ఆ ప్రభావం దానిలో పని చేస్తున్న ఉద్యోగ, కార్మికులపై కూడా తీవ్రమైన ప్రభావం చూపింది. రోజు వారీ వేతనం, అలాగే నెలవారీ వేతనంపై పని చేస్తున్న చిరుద్యోగులకు డైరీ పని చేయకపోవడంతో వారీ జీవనంపై కూడా తీవ్రమైన ప్రభావం చూపుతుందని కార్మిక, ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు రోజులకే తీవ్రమైన ప్రభావం చూపుతున్న నేపథ్యంలో వరద నీరు ఎప్పుడు బయటకు పోతుందో...డెయిరీని ఎప్పుడు తెరుస్తారోనని అటు వినియోగదారులు, ఇటు ఉద్యోగ, కార్మికులు ఎదురు చూస్తున్నారు. మరొక వైపున డెయిరీకి భారీ మొత్తంలో నష్టం వాటిల్లుతుంది.

అన్నపానీయాల కోసం ఎదురుచూపులు...



ప్రజాశక్తి-విజయవాడ: అన్న పానీయాలు అందక వరద బాధితులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రెండు రోజుల నుంచి వరద నీటిలో చిక్కుకుపోయిన నగరంలోని ఆయా ప్రాంతాల ప్రజలు కనీసంగా తాగడానికి మంచినీరు కూడా అందుబాటులో లేక అలమటిస్తున్నారు. నీటి మధ్యలోనే చిక్కుకున్నా...తాగడానికి గుక్కెడు మంచినీరు కరవై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుడమేరు వరద నీటిలో సింగ్‌నగర్‌లోని 8 డివిజన్లలోని 30 వేల కుటుంబాలు, లక్ష మందికి పైగా ప్రజలు చిక్కుకుపోయి రెండు రోజుల నుంచి తీవ్ర అవస్థలు పడుతున్నారు. మంచినీరు, పాలు, భోజనం అందడం లేదని రాష్ట్ర మంత్రి సంధ్యారాణిని కండ్రిక ప్రాంత ప్రజలు చుట్టుముట్టి నిలదీశారు. అలాగే గతంలో ఎన్నడూ ఎరుగని హౌసింగ్ బోర్డు కాలనీని కూడా బుడమేరు వరద నీరు చుట్టుముట్టడంతో ఆ ప్రాంత ప్రజలు అవస్థలు వర్ణనాతీతంగా తయారయ్యాయి. స్వాతిథీయోటర్ ఏరియా, రైతు బజార్ ఏరియా కూడా వరద ముంపుకు లోనైంది. ఇదే విధంగా గీతానగర్ కరకట్ట స్మశాన వైపు నుంచి కృష్ణానది వరద నీరు పెద్ద ఎత్తున రాణిగారితోట మసీదు రోడ్డు డౌన్, శాంపిల్ బిల్డింగ్, తారకరామానగర్, భూపేష్‌గుప్తానగర్ తదితర ప్రాంతాల్లోని 1500 గృహాల్లోకి పెద్ద ఎత్తున నీరు చేరింది. సింగ్‌నగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, రాణిగారితోట ప్రాంతాల్లో సుమారు రెండు లక్షల మంది ప్రజలు అన్న పానీయాల కోసం రోజుల తరబడి ఎదురు చూడాల్సి వచ్చింది. విజృంభిస్తున్న విషజ్వరాలతో ఈ ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నా కనీసంగా మందు బిళ్ల ఇచ్చిన వారు లేరని, పలకరించిన నాధుడే లేరని బాధిత ప్రజలు వాపోతున్నారు. టైఫాయిడ్, మలేరియా జ్వర పీడితులు చికిత్సకోసం, ఆశ్రయం కోసం నడుమలలోతు వరద నీటిలో నడుచుకుంటూ బయటపడాల్సి వస్తోంది.

వారి వారి ఇళ్ల వద్ద నుంచి వరద నీటిలోనే నడుచుకుంటూ వచ్చి... సింగ్‌నగర్ ఫ్లైఓవర్ చివరి వరకు ఎటువంటి వాహనం అందుబాటులో లేక వయోభారంతో బాధపడుతున్న వారు, జ్వరపీడితులు అల్లాడిపోతున్నారు. అన్ని రకాలుగా భోజనం సదుపాయంతో పాటు రవాణా, ఇతర స దుపాయాలు కల్పించామని ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం అవుతుందనే విమర్శ లేకపోలేదు. పీకల్లోతు నీటిలో రోజుల తరబడి నానిపోతూ...ఎటువంటి వసతి లేక పేదలు మగ్గుతున్నా ప్రభుత్వం కనీసంగా కనికరం చూపడం లేదని సింగ్‌నగర్‌లోని ఆయా ప్రాంతాల పేద ప్రజలు వాపోతున్నారు. ఆకలితో అలమటిస్తున్న ప్రజలకు భోజనం ప్యాకెట్లతో వచ్చిన వాహనాన్ని చూడటంతో బుడమేరు బ్రిడ్జీ వద్ద ఒక్క సారిగా ఎగబడటం కనిపించింది. ఇదే రీతిలో అన్ని ప్రాంతాల్లో నెలకొన్నది. ఒక వైపున అన్నపానీయాలు, మరొక వైపున విషజ్వరాలతో పేద, దిగువ మధ్యతరగతి ప్రజలు అల్లాడిపోతున్నారు. అయినా ప్రభుత్వం మాత్రం ఏదో చేసేస్తున్నట్లు...ప్రచారం చేయడం తప్ప...ఆచరణలో ప్రజలను ఆదుకుంటున్న పరిస్థితి లేకుండా పోయింది.



భోజనం ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి-విజయవాడ: జనసేన రాష్ట్ర నాయకులు అమ్మిశెట్టి వాసు నేతృత్వంలో 15 వేల మందికి భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. సింగ్‌నగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, రాణిగారితోట తారకరామానగర్ తదితర ఏరియాల్లో జనసేన నాయకులు వరద బాధితులకు భోజన సదుపాయం కల్పించారు. వరద నీటిలోనే ఇంటింటికీ తిరుగుతూ, వారిని పరామర్శిస్తూ, భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్ట్

ప్రజాశక్తి-గన్నవరం: ముస్తాబాద్ గ్రామ ఆంధ్రజ్యోతి రోడ్డులో దారి దోపిడీ సంఘటనలో ఐదుగురు దొంగలను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ బీ.వీ శివప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గన్నవరం ఎస్ ఐ, సిబ్బంది రెండు బందాలుగా ఏర్పడి అన్ని కోణాలలో సాంకేతిక పరిజ్ఞానంతోవారి కదలికలపై నిఘా పెట్టారన్నారు. గన్నవరం మండలం బిబిగూడెం ఫ్లైవర్ అండర్ పాస్ వద్ద నల్గొండ జిల్లా జక్కంపూడికి చెందిన పాలపర్తి వెంకన్న, సురేష్, దేవరకొండ దావీదు, పసుపు రెడ్డి దుర్గాప్రసాద్, కుమ్మరిపాలెంకు చెందిన నక్క గోపిరాజులను సోమవారం అదుపులో తీసుకున్నారన్నారు.

బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం : కాశీనాథ్

ప్రజాశక్తి-విజయవాడ: తూర్పు నియోజకవర్గ పరిధిలో రణదివే నగర్, తారక రామానగర్, భూపేష్ గుప్తా నగర్, రామలింగేశ్వర నగర్ లోని వరద ప్రాంతాల్లో సీపీఎం బందం సోమవారం పర్యటించింది. వరద తీవ్రత, బాధితుల ఇబ్బందులపై వారి నుంచి నాయకులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ తక్షణం వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కృష్ణలంక ఏరియాలోని రణదివెనగర్, తారకరామానగర్, భూపేష్‌గుప్తా నగర్, రామలింగేశ్వర్‌నగర్ తదితర ప్రాంతాల్లో వరద నీరు ఇళ్లల్లోకి చేరి రోజుల తరబడి బాధిత ప్రజలు పలు రూపాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలనలు, పర్యటనలు తప్ప...బాధితులకు ఒరిగేదేమి ఉండటం లేదని పేర్కొన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టేపుడు ప్రభుత్వం, అధికారులు మరింత అప్రమత్తంగా ఉంటే ఈ వరద ప్రవాహం వచ్చేది కాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు పుప్పాల కృష్ణ, నగర కమిటీ సభ్యులు కోరాడ రమణ, నాయకులు ఎన్. నాగేశ్వరరావు, జి.కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరదను నిలువరించిన సిపిఎం, టిడిపి, వైసిపి:

రాణిగారితోట 18వ డివిజన్ కనకదుర్గా వారధి కింద కృష్ణానది వరద నీరు డివిజన్‌ను ముంచెత్తకుండా సిపిఎం, టిడిపి, వైసిపి నాయకులు, కార్యకర్తలు అప్రమత్తమై వరదను నిలువరించారు. వరద నీరు రాకుండా సుమారు



500 ఇసుక బస్తాలు అడ్డుకట్ట వేసి నిలువరించారు.దీంతో ఆ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రాణిగారితోట మసీదు రోడ్డు డౌన్, శాంపిల్ బిల్డింగ్, తారకరామానగర్, భూపేష్‌గుప్తానగర్ తదితర ప్రాంతాల్లో సిపిఎం నాయకులు పర్యటించి, బాధితుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి చంద్రశేఖర్, వై కృష్ణ, ఎ.ఆదాం పాల్గొన్నారు.